ప్రజాశక్తి

సోమవారం 17 మార్చి 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తల్లడిల్లుతున్న తాడి

◆ హామీకే పరిమితమైన తరలింపు ◆ 15 ఏళ్లుగా ప్రభుత్వాలకు పట్టని సమస్య

◆ కాలుష్యంతో ప్రజలు అనారోగ్యాలపాలు



కాలుష్య బాధిత తాడి గ్రామం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

ఔషధ పరిశ్రమలకు అతి సమీపంలోని అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తాడి ప్రజలు దాదాపు 15 ఏళ్ల నుంచి కాలుష్య సమస్యతో బాధ పడుతున్నారు. అయినా ఏ ప్రభుత్వమూ కనికరించలేదు. భరించలేని కాలుష్యంతో చర్మ వ్యాధులు, శ్వాసకోశ, గుండె జబ్బులు, కీళ్ల నొప్పులు, కిడ్నీ, గర్భస్రావ, నిద్రలేమి సమస్యలతో చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు బాధపడుతున్నా ఏ ఎమ్మెల్యే, ఎంపీ మనసు కరగలేదు. తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించి ఆదుకోవాలనే గట్టి ప్రయత్నం వారెవరూ చేయలేదు. ఫలితంగా అనేక అనారోగ్య సమస్యలతో తాడి ప్రజలు మంచానపడుతున్నారు.

'ఒకప్పుడు కూరగాయలు బాగా పండించే మేము పరిశ్రమలొచ్చాక కాలుష్యానికి పంటలు పండక కొనుక్కోవాల్సి వస్తోంది. ఇప్పుడు నీటికి ఇబ్బంది పడుతున్నాం. వయస్సు తేడా లేకుండా జబ్బులతో బాధపడుతున్నాం. పుట్టినవాళ్లు అనారోగ్యంతో పుడుతున్నారు. అర్హతను బట్టి పని ఇవ్వడంలేదు. వూరు తరలిస్తామని ఎమ్మెల్యే, ఎంపీలు చెప్పడమేగానీ తరలించడంలేదు' అని ఈ నెల 11న ప్రజా చైతన్యయాత్రలో భాగంగా తాడి వెళ్లిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముందు మహిళలు వ్యక్తంచేసిన ఆవేదన ఇది. దీనిని బట్టే వారు ఎన్ని ఇబ్బందులను ఎదుర్కొంటున్నారో ఇట్టే చెప్పొచ్చు.

నాడు ఏం జరిగింది ?

2,400 ఎకరాల విస్తీర్ణంలో 2006లో పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ (జెఎన్‌పిసి)ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి)కి కాకుండా ర్యాంకీకి భూమిని అప్పగించింది. ర్యాంకీ ఆది నుంచీ పర్యావరణ ప్రమాణాలు పాటించలేదు. గ్రీన్‌బెల్ట్‌కు కేటాయించిన స్థలాన్ని కూడా విక్రయించి లాభాలు ఆర్జించింది. వ్యర్థాలు శుద్ధి చేయకుండా విడిచిపెట్టడంతో భూగర్భ జలాలు, గాలి కాలుష్యం కావడంతో తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చాయని ప్రజలు చెబుతున్నారు.

తాడి తరలింపును ఎన్నికల అంశంగా టిడిపి, బిజెపి, జనసేన, వైసిపి వాడుకున్నాయి తప్పితే పరిష్కారానికి గట్టి మిగతా 2లో..



'స్టీల్‌ప్లాంట్‌కు ఊతమివ్వని ప్యాకేజీ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మికులకు నష్టం చేసేటటువంటి నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆదివారం జరిగిన సిఐటియు విశాఖ జిల్లా కౌన్సిల్ సమావేశం డిమాండ్ చేసింది. ఎంవిపి.కాలనీ సెక్టార్ -5లోగల ఐక్యత భవన్‌లో ఈ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికే దేశంలోగల విమానాశ్రయాలను, నౌకాశ్రయాలను, చమురు సంస్థలను, వివిధ ప్రభుత్వ పరిశ్రమలను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకు నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలని శతవిధాలా ప్రయత్నిస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం రూ.11,445 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ఇచ్చామని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కానీ ఆ ప్యాకేజీ డబ్బులను స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసంగానీ, ఉత్పత్తి, కార్మికుల జీతాల కోసంగానీ ఉపయోగించడం లేదన్నారు. పాత బ్యాంకు అప్పులను తీర్చడం కోసం ప్యాకేజీ నిధులను వాడటం దుర్మార్గమన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. అందులో భాగంగానే 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసిందన్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా ప్రయత్నం చేస్తోందన్నారు. అవి అమలయితే కార్మికులు అనుభవిస్తున్నటువంటి ప్రస్తుత హక్కులన్నీ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అందుకనే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ మేలో దేశవ్యాప్తంగా మిగతా 2లో..

జైల్లోకి సెల్ ఫోన్ తీసుకెళ్లిన కేసులో ఇద్దరు అరెస్టు

▶ వార్త 3లో..

విద్యుత్ బిల్లుల భారంపై గగ్గోలు

▶ వార్త 5లో..

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

▶ వార్త 7లో..



బీచ్ రోడ్డులో గ్లకోమా అవేర్‌నెస్ వాక్

వార్త 2లో..

పక్కాగా పది పరీక్షలు

◆ నేటి నుంచి ప్రారంభం ◆ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

◆ 144 సెక్షన్ విధింపు ◆ సమస్యాత్మక కేంద్రాల్లో సిసి కెమెరాలు

◆ 'ప్రజాశక్తి'తో జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

'పక్కాగా పది పరీక్షల నిర్వహణకు తగిన చర్యలు చేపట్టాం. మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. ఆరు సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశాం. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులూ కల్పించాం. ఎవరూ సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాలకు తీసుకురాకూడదని చెప్పాం. పరీక్ష సమయానికి అరగంట ముందే రావాలి. జిల్లాలో పది పరీక్షలు 22,042 మంది విద్యార్థులు రాయనున్నారు' అని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. పది పరీక్షల ఏర్పాట్లు, నిర్వహణకు సంబంధించిన వివరాలను ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తల్లడిల్లుతున్న తాడి

ప్రయత్నం చేయలేదు. తరలింపు తనకు సంబంధం లేదని ర్యాంకీ, ఎంతోకొంత చెల్లించి బయటపడిపోదామని ప్రభుత్వాలు భావిస్తూ వస్తున్నాయి. పరిశ్రమలతో భూములు కోల్పోయి, కాలుష్యంతో బతుకులు పోగొట్టుకున్న బాధిత ప్రజలకు న్యాయమైన పరిహారం చెల్లించి తరలించాలని ఏ ప్రభుత్వమూ అనుకోవడంలేదు. ఎన్నికల ముందు తాడి తరలింపు తమ బాధ్యతని హామీ ఇవ్వడం, ప్రమాణాలు చేయడమేగానీ తరువాత తరలింపును విస్మరిస్తున్నారు. నాలుగు ప్రభుత్వాలు మారినా తాడి తరలింపునకు నోచుకోలేదు. ఎన్‌జిటి ఆదేశంతో తాగునీటి సమస్య కొంతవరకు తీరిందిగానీ గెలిచిన ఏ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ నీటి సమస్యను తీర్చలేదు. కాలుష్య వాసన భరించలేక తలుపులు వేసుకొని సాయంత్రం నుంచి తెల్లవారే వరకు గ్రామస్తులు బయటకు రాలేని పరిస్థితివుంది. నిల్వ చేసుకున్న నీటిపై 24 గంటలు గడిచేసరికి నల్లటి పొర ఏర్పడుతోందని బాధితులు చెబుతున్నారు.

ఎన్నికల ముందు 2019 ఫిబ్రవరి 6న తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలను పెదముషిడివాడ తరలింపునకు రూ.57.63 కోట్లు విడుదల చేస్తూ చంద్రబాబు ప్రభుత్వం జిఒ 29ని జారీ చేసిందికానీ నిధులు విడుదల చేయలేదు. పది రోజుల్లో తాడి గ్రామం తరలింపునకు అవసరమైన రూ.56 కోట్లు ఇస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారుగానీ తరలింపు చర్యలు చేపట్టలేదు. అసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాద స్థలం పరిశీలనకు 2024 ఆగస్టు 22న కంపెనీకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును మీడియా ప్రశ్నించగా తాడి తరలింపుపై వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినా ఆ తరువాత ఆ ఊసే మర్చిపోయారు.

పరిహారం చెల్లించి తరలించాలి



2013 భూ సేకరణ చట్టం ప్రకారం ఇళ్లు, భూములకు పరిహారం, మేజర్లకు ప్యాకేజీ చెల్లించాలి. తాజాగా సర్వే చేసి మేజర్లను గుర్తించాలి. సురక్షిత ప్రాంతంలో మౌలిక సదుపాయాలన్నీ సమకూర్చి, పునరావాసం కల్పించి తాడి, చినతాడి, బిసి కాలనీ ప్రజలను తరలించి ఆదుకొనే చర్యలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలి.

గనిశెట్టి సత్యనారాయణ,
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

అఖిలభారత సమ్మె నిర్వహించాలని కేంద్ర కార్మిక సంఘాలన్నీ ఇప్పటికే నిర్ణయించాయన్నారు. ఈ జాతీయ సమ్మెను జయప్రదం చేయడం ద్వారా మోడీ విధానాలకు అడ్డుకోవడం సాధ్యపడుతుందన్నారు. లేబర్ కోడ్స్ వల్ల కార్మికులకు జరిగే నష్టాలను కింది వరకూ తీసుకువెళ్లాలని, అందులో భాగంగా విస్తృతంగా కరపత్రాలు, బుక్‌లెట్స్ పంపిణీ చేయాలని, గ్రూప్ మీటింగ్‌లు జరపాలని తీర్మానించామన్నారు. సమావేశంలో 'స్టీల్‌ప్లాంట్‌కు ఊతమివ్వని ప్యాకేజీ' బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.మణి, ఎస్.జ్యోతీశ్వరరావు, యు.రాజు మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, విశాఖ పోర్ట్ యూనియన్, ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన పథకం, మున్సిపల్, ఆటో, భవన నిర్మాణ, ఇంటిపనివారుల సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పక్కాగా పది పరీక్షలు

పది పరీక్షల ఏర్పాట్లు ఎలా వున్నాయి?

పది పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లన్నీ పూర్తిచేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం లేకుండా వసతులు కల్పించాం. బెంచీలు, తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు పరీక్ష కేంద్రాల్లో వున్నాయి. రాష్ట్ర విద్యాశాఖ అదనపు సంచాలకులు రాష్ట్ర స్థాయి పరిశీలకులు పి.శ్రీనివాసరావుతో కలిసి పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించాం. బాగున్నాయి. ప్రాథమిక వైద్యం కోసం పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో వుంటారు.

ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారు?

జిల్లాలో 22,042 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరి కోసం 107 కేంద్రాలను ఏర్పాటుచేశాం. గతంలో పరీక్ష తప్పిన విద్యార్థులు 1258 మంది, దూర విద్య విద్యార్థులు 668 పరీక్షలకు హాజరుకానున్నారు. దూర విద్య విద్యార్థులకు యలమంచిలి, చోడవరం, అనకాపల్లిలో కేంద్రాలు ఏర్పాటుచేశాం.

మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా తీసుకున్న జాగ్రత్తలు?

మాస్ కాపీయింగ్‌కు అవకాశంలేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. తెనుగుపూడి, పాయకరావుపేట, డి.ఎర్రవరం, లక్కవరం, దిమిలి, తాటిపర్తిలోని పరీక్ష కేంద్రాలను సమస్యాత్మకమైనవని గుర్తించాం. ఈ ఆరు చోట్ల సిసి కెమెరాలు ఏర్పాట్లు చేశాం. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ వుంది.

విద్యార్థులు, నిర్వాహకులకు మీరు ఇచ్చే సూచనలు?

నేటి నుంచి ఏప్రిల్ ఒకటి వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నాం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష సమయానికి విద్యార్థులు, నిర్వాహకులు అరగంట ముందు చేరుకోవాలి. తమ హాల్‌టిక్కెట్లు చూపించి పల్లె వెలుగు, సిటీ, ఆర్డినరీ బస్సుల్లో ఆర్‌టిసి కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రతి విద్యార్థీ వినియోగించుకోవాలి. తమ వెంట పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికాలు తీసుకురాకూడదు. హాల్ టికెట్లను ముందుగా తనిఖీ చేసి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించాలి.

పరీక్షల నిర్వహణకు ఎంతమందిని నియమించారు?

పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు 107 మంది ఛీఫ్ సూపరింటెండెంట్లు, 107 మంది డిపార్టుమెంట్ అధికారులు, 29 సిటింగ్ స్క్వాడ్‌లను నియమించాం. లోపాలు తలెత్తకుండా పరీక్షలు జరిగేలా నిర్వహణ అధికారులు, స్క్వాడ్ బందాలకు శిక్షణ ఇచ్చాం. పలు సూచనలు చేశాం. అవాంఛనీయ సంఘటనల్లో భాగస్వాములపై కఠిన చర్యలు తీసుకుంటాం.

జగన్ హయాంలో కూలిన వ్యవస్థలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ కూలిపోయాయని టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ విమర్శించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సిఎంగా పగ్గాలు చేపట్టే నాటికి సుమారు 11 లక్షల కోట్లు అప్పులతో ఈ రాష్ట్రం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. జగన్ హయాంలో హంద్రీ నీవా, తోటపల్లి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులు ఆగిపోయాయన్నారు చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఉమ్మడి విశాఖ ఉత్తరాంధ్ర జిల్లాలో 2 లక్షల కోట్లు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. పోలవరం కోసం రూ.15 వేల కోట్లు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. సూర్య ఘర్ ద్వారా సోలార్ విద్యుత్ అందిస్తున్నారన్నారు. వైసిపి మాజీ నేత విజయసాయిరెడ్డిలో పరివర్తన వచ్చిందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గొంపా సత్యనారాయణ, నాయకులు భరత్ పాల్గొన్నారు.

లక్ష మంది మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లక్ష మంది మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా షీరో సంస్థ పనిచేస్తోందని సంస్థ వ్యవస్థాపకులు జయశ్రీ తిలక్ తెలిపారు. ఆదివారం నగరంలోని దసపల్లా హోటల్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనేక మంది మహిళలు అటు ఉద్యోగం, ఇటు వ్యాపారం చెయ్యలేక సతమతమవుతున్నారని తెలిపారు. అలాంటి వారు ఇంటి నుంచే పనిచేసేలా షీరో సంస్థ నేనున్నాను అంటూ ప్రోత్సహిస్తోందన్నారు. ఎటువంటి పెట్టుబడి లేకుండా తమ కిచెన్‌లో వుండే వంట సామానులతోనే ఇంటి వంటకాలను తయారు చేసి ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్స్ వచ్చేలా చేసి తద్వారా మహిళలు ప్రతినెలా స్థిరమైన ఆదాయాన్ని పొందేలా షీరో సంస్థ అండగా నిలుస్తోందని తెలిపారు. ఈసరికే 3 వేల మందికి ఉపాధి ఇస్తున్న తమ సంస్థ మహాప్రసాద్ పేరిట మరో బ్రాండ్‌ను ప్రారంభించి తద్వారా మహిళలు తాము నిత్యం చేసే స్వీట్స్, స్నాక్స్, పొడులు, నిల్వ పచ్చళ్ళను ఆన్ లైన్ ద్వారా అమ్ముకునేలా ఒక వేదికను ప్రారంభించిందని తెలిపారు. ఈ లోగోను బాలీవుడ్ హీరోయిన్లు మౌబాని సర్కార్, ముంతాజ్ సర్కార్, అల్వియా ముఖర్జీ, దనీ బోస్, స్నేహ షా, ప్రీతా మోజెందర్, ఎఫ్‌టిపిసి ఇండియా అధ్యక్షులు చైతన్య జంగాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో షీరో వ్యవస్థాపకులు తిలక్ వెంకటస్వామి, షీరో తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త విజయ్ వర్మ పాకలపాటి పాల్గొన్నారు.



లోగోను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు, హీరోయిన్లు

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాస రావు ఆదివారం ఉదయం ఎంవిపి. కాలనీలోగల ఆయన నివాసంలో విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా భీమిలి అసెంబ్లీ నియోజకవర్గం గుండా వెళ్లే ప్రతిపాదిత బృహత్తర ప్రణాళికా రహదారులు గురించి అడిగి తెలుసుకున్నారు. వీటి ద్వారా జాతీయ రహదారిపై ఒత్తిడి తగ్గి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రజలు చేరుకోవడం సులువవుతుందన్నారు.

బీచ్ రోడ్డులో గ్లకోమా వాక్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీచ్ రోడ్డులోని కాళీ మాతా మందిరం నుంచి వైఎంసిఎ వరకూ గ్లకోమా అవేర్‌నెస్ వాక్ నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో నేత్ర సంరక్షణా వ్యవస్థపై ఈ నెల 8 నుంచి 16 వరకూ అవగాహనా వారోత్సవాలను నిర్వహించి, చివరి రోజు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ క్యాంపస్ హెడ్ డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గ్లకోమా బాధితులు 80 మిలియన్ల మంది ఉన్నారన్నారు. అందులో దాదాపు 50 శాతం మందికి గ్లకోమా ఉందనే అవగాహన కూడా లేదని తెలిపారు. చికిత్స చేయకపోతే గ్లకోమా అంధత్వానికి దారి తీస్తుందని పేర్కొన్నారు. గ్లకోమా కన్సల్టెంట్ ఆఫ్థల్మాలజిస్ట్‌లు డాక్టర్ శివాని కోడాలి, డాక్టర్ టి.సాయి యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

మండల సమావేశంలో ఎంపిపి

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేసవి నేపథ్యంలో మండలంలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎఇ దుర్గా భవానీని ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆదివారం సాయంత్రం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం దృష్టికి నాయకులు పలు సమస్యలను తీసుకొచ్చారు. వేములవారి కల్లాల్లో తాగు నీటి సమస్య ఉందని, జల జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు వెయ్యాలని తాటితూరు ఎంపిటిసి సభ్యులు ఉండభట్ల ఆదిలక్ష్మి కోరారు. రేఖవానిపాలెం పంచాయతీ పరిధిలోనూ, టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెంలోనూ తాగు నీటి సమస్య ఉందని రేఖవానిపాలెం సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, టి.నగరపాలెం ఎంపిటిసి పల్లా నీలిమ సభలో ప్రస్తావించారు. ఇందుకు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ దుర్గా భవానీ బదులిస్తూ, తాటితూరు వేములవారి కల్లాల్లో 35 నుంచి 40 వరకు ఇంటింటి కుళాయిలు త్వరలో వేయనున్నట్లు చెప్పారు. రేఖవానిపాలెం, గొల్లలపాలెంలోనూ తాగు నీటి సమస్యను పరిష్కరిస్తామని వివరించారు.

హౌసింగ్ రూరల్ ఎఇ ఎం.హుస్సేన్ మాట్లాడుతూ, 2024 డిసెంబర్ 10 నాటికి వివిధ స్థాయిల్లో ఉన్న ఇళ్లను మే 31నాటికి పూర్తిచేయాలని లబ్ధిదారులకు సూచించారు. పూర్తయిన గృహాలను జూన్ మొదటి వారంలో ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు వివరించారు.

తాటితూరు, సామయ్యవలస గ్రామాల మధ్య గోస్తనీపై కాజ్‌వే నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరవ్వడం పట్ల ఎంపిపి దంతులూరి వెంకట శివ సూర్య నారాయణ రాజు హర్షం వ్యక్తం చేశారు. వైస్ ఎంపిపి బి.బంగారునాయుడు, తహశీల్దార్ పి.రామారావు, ఎంఇఒ-1 ఎం.శివరాణి, విద్యుత్ శాఖ రూరల్ ఎఇ హరికుమార్, వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి, ఎంపిడిఒ ఎన్.హనుమంతరావు తదితరులు పలు అంశాలపై మాట్లాడారు. పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి డివిఎస్ఎస్ఎన్.రాజు

హోమియో మందుల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ఆదివారం ప్రారంభించారు. వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ 90 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

103 మంది రక్త దానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్ ప్రాంగణంలో నీడీ వెల్ఫేర్ అసోసియేషన్, బ్లిస్ కేటరింగ్ సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 130 మంది నుంచి విశాఖ బ్లడ్ సెంటర్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. రక్త దానం చేసిన వారికి నిర్వాహకులు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సన్ స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాస్, లక్ష్మీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మెంటల్ హెల్త్‌పై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని నేళ్లేరు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మెంటల్ హెల్త్‌పై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని కౌన్సెలర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిసి జె.చంద్రశేఖర్, జిసిడిఒ కలేశా బేగం, విశాఖపట్నం జిల్లాలోని మూడు కెజిబివి ప్రిన్సిపల్స్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చర్చిని మినహాయించి విస్తరణ జరపాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మాస్టర్ ప్లాన్ ప్రకారం స్థానిక మెయిన్ రోడ్డుతో పాటు ఆంధ్రా బాప్టిస్టు చర్చికి ఆనుకుని ఉన్న రోడ్డును విస్తరించే ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో చర్చి ఎదురుగా ఉన్న కొంత భాగాన్ని మినహాయించి విస్తరణ పనులు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆంధ్రా బాప్టిస్టు సంఘం కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సంఘం అధ్యక్షులు కెఎస్ఎం.సుధాకర్, కార్యదర్శి ఎన్.రవికుమార్, కోశాధికారి పిఎస్.చందు, ఆల్బర్ట్ సుదర్శన్ తదితరులు ఎమ్మెల్యే గంటాను ఆదివారం ఎంవిపి కాలనీలో ఉన్న అతని నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. సంబంధిత పురాతన చర్చిని హెరిటేజ్ ప్రాపర్టీగా పరిగణించి చర్చి అభివృద్ధికి, పరిరక్షణకు తోడ్పాటు ఇవ్వాలని కోరారు.

ఆస్తి విలువపై పన్ను అన్యాయం

ప్రజాశక్తి-మధురవాడ : అమ్ముకునేటప్పుడు లభించే విలువపై ఆస్తి పన్ను విధించడం చాలా అన్యాయమని, దీనిని రద్దుచేయాలని వార్డు, నివాస్ సభ్యులు డిమాండ్‌చేశారు. బక్కన్నపాలెంలోని ఎస్ఎవిఎస్ రాయల్ పారడైజ్‌లో వార్డు నివాస్ మధురవాడ జోన్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. 25 మంది సభ్యులు హాజరై స్థానిక సమస్యలపై చర్చ జరిపారు. ఆస్తి పన్నుపై వెంటనే సమీక్ష జరిపి రద్దుచేయాలని కోరుతూ ప్రతి అపార్ట్‌మెంట్ అసోసియేషన్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని పంపించాలని సమావేశం నిర్ణయించింది. సర్దుబాటు పేరుతో విద్యుత్ బిల్లులు పెంచారని, ప్రీపెయిడ్ రీచార్జీ విధానంతో రాబోయే స్మార్ట్ మీటర్లు ప్రజలను ఇంకా దుర్భరం చేస్తాయని పేర్కొన్నారు. అపార్ట్‌మెంట్లు, కాలనీ ఇళ్లల్లో స్మార్ట్ మీటర్లు బిగించడానికి అనుమతించరాదని, వాటిని బిగించడానికి వచ్చే సిబ్బందిని తిరస్కరించాలని పిలుపునిచ్చారు. గుంతలతో ప్రమాదకరంగా ఉన్న మధురవాడ రోడ్లను వెంటనే వేయించాలని, మురుగు కాలువలను, రోడ్లను రోజు శుభ్రం చేయాలని, చాలాచోట్ల వీధిలైట్లు లేవని, వీటిపై జోనల్ కమిషనర్‌ను త్వరలోనే కలిసి విజ్ఞప్తి చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో వార్డు, నివాస్ సభ్యులు సి హెచ్.గోవిందరావు, జి.రఘురామ్, నారాయణరావు, ధర్మారావు, టి.శ్రావణి యు.శారద, శేషగిరి పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస సెక్షన్ పరిధిలో రూ.3 కోట్లతో నూతనంగా నిర్మించనున్న 33 /11కెవి ఉప కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ జి.శ్యామ్‌బాబు, జోన్- 3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు, డిఇఇ ఆర్.రమేష్, ఎఇలు బి.రవి, హరికుమార్, యు.శకరయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి పలు సమస్యలను జనసేన రెండో వార్డు అధ్యక్షులు నీలాపు శంకరరెడ్డి తీసుకెళ్లారు. చిట్టివలస చిల్లపేట పెద్ద చెరువు విస్తీర్ణం తగ్గడంపై సమగ్ర సర్వేకు ఆదేశించాలని, సత్యనారాయణపేట కొండ వాలు ప్రాంతంలో తాగు నీటి ఇబ్బందులు పరిష్కరించాలని కోరారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి- పద్మనాభం : భీమిలి కోర్టు ఆధ్వర్యాన మండలంలోని మద్ది గ్రామంలో ఆదివారం న్యాయ విజ్ఞాన వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు మెజిస్ట్రేట్ సౌజన్య మాట్లాడుతూ, పిల్లల్లో 18 సంవత్సరాలు దాటిన తర్వాత వ్యవహార శైలి మారుతుందని, ఆ సమయంలో తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ఆ సమయంలో పిల్లలు బాగా చదువుకుంటేనే అభివృద్ధి చెందుతారన్నారు. ప్రతి విషయాన్ని పిల్లలు తల్లిదండ్రులకు చెప్పాలని, తల్లిదండ్రులు కూడా వినాలని సూచించారు. పిల్లలు ఇంటి నుంచి వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చినప్పుడు వారి వ్యవహార శైలిని గమనించాలన్నారు. బాలికలపై అత్యాచారాలు పెరగడంతో పోక్సో చట్టాన్ని తెచ్చారని, దీని ప్రకారం 60 రోజుల్లో కేసును పూర్తి చేసి కఠినమైన శిక్ష విధించనున్నట్లు తెలిపారు. గ్రామ పెద్దల వ్యవహారశైలి ఒక జడ్జిగా ఉండాలన్నారు. అప్పుడే క్రైమ్ రేటు తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎజిపి అప్పలరాజు, సిఐ సిహెచ్.శ్రీధర్, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనంతవరంలో మజ్జిగ కేంద్రం

ప్రజాశక్తి -పద్మనాభం : గంధవరం వాసవి క్లబ్ ఆధ్వర్యాన మండలంలోని అనంతవరం గ్రామంలో ఆదివారం మజ్జిగ చలివేంద్రాన్ని క్లబ్ అధ్యక్షులు టి.వెంకట్రావు ప్రారంభించారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన చలివేంద్రంలో 100 లీటర్ల మజ్జిగను పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ అధ్యక్షులు ఎరుపుల రామకృష్ణ ఆదేశాలతో గంధవరం గ్రామానికి చెందిన కలగర్ల శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు వెంకట్రావు, అభి, మురళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ మొల్లి హేమలత, నాయకులు మొల్లి లక్ష్మణరావు ఆదివారం పరిశీలించారు. సాయిరాంకాలనీలో వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సహాయ సహకారంతో వార్డుల్లో దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారమార్గం దొరికిందన్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని రోడ్లు, కల్వర్టులు, పార్కుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

అలరించిన నృత్యాలు

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ శిల్పారామం జాతరలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి. మహాగం వతిం మనసా స్మరామి, అయిగిరి నందిని, గోదారి గొప్పది, రాజాంకొండ మీద, జై జనార్ధన కృష్ణా, కళ్ల భస్మ, కోయిలారా తదితర గేయాలకు చిన్నారులు చిత్ర, వీరిక, గాయిత్రి, లక్ష్మీప్రణతి, ఈశ్వరి, దీపిక తదితరులు నృత్య ప్రదర్శనలిచ్చారు. పరిపాలనాధికారి పర్యవేక్షించారు.

నేరాలు ఘోరాలు

జైల్లోకి సెల్ ఫోన్ తీసుకెళ్లిన కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలోకి సెల్ ఫోన్ తీసుకెళ్లిన కేసులో జైల్లో ఫార్మాసిస్ట్‌గా పనిచేసిన కడియం శ్రీనివాసరావు, అతని భార్య కడియం పుష్పలతను ఆరిలోవ పోలీసులు ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేంద్రకారాగారంలో గతంలో ఫార్మాసిస్ట్‌గా పనిచేసిన కడియం శ్రీనివాసరావు రెండు మొబైల్ ఫోన్లను జైల్లో శిక్ష అనుభవిస్తున్న నాగమల్లేశ్వరరావుకు ఇచ్చిన విషయం నిర్ధారణ కావడంతో ఆరిలోవ ఎస్ఐ కృష్ణ ఆదివారం దారపాలెం వద్ద భార్యాభర్తలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-మునగపాక: మండల కేంద్రం మునగపాకలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన మాడా కన్నారావు (52) మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరవాడ డిఎస్‌పి విష్ణు స్వరూప్, సిఐ అల్లు స్వామి నాయుడు, ఎస్సై పి ప్రసాదరావులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించి స్థానిక ఎస్ఐ పి. ప్రసాదరావు అందించిన వివరాలివి.

ఆదివారం ఉదయం కాయగూరలను కొనేందుకు ఇంటి నుండి స్కూటీపై మార్కెటు రోడ్డులో కన్నారావు వెళ్తుండగా, అదే సమయంలో అచ్యుతాపురం నుండి అనకాపల్లి వెళుతున్న లారీ స్కూటీ పక్క భాగాన్ని ఢీకొట్టడంతో కన్నారావు అదుపుతప్పి లారీ చక్రాల కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలభాగం చితికి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కన్నారావుకు ఇద్దరు భార్యలు కాగా, ముగ్గురు సంతానం. మృతుడు మొదటి భార్య మాడా పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ మల్లికార్జునరావు

దిబ్బమీదపాలెంలో సిసి రోడ్డు

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దిబ్బమీదపాలెంలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు ఏర్పాటుకు సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు (చంటి) ఆధ్వర్యాన పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లికార్జునరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు అభినందనలు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనుజు మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : కైలాసగిరి వాకింగ్ ట్రాక్ హెల్త్ ఎరీనా బుద్ధుని విగ్రహం సమీపంలో కనుజు పిల్ల ఆదివారం ఉదయం మృతి చెంది పడి ఉంది. అటువైపు వెళ్లిన వాకర్స్ దానిని గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. రెండు రోజుల క్రితం మానుపిల్లి ఇదే విధంగా మృతి చెందిన సంగతి తెలిసిందే. ఎండలు తీవ్రంగా ఉండడం, తాగేందుకు నీటి సదుపాయం లేకపోవడంతో వన్యప్రాణులు చనిపోయి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. అటవీశాఖ అధికారులు హెల్త్ ఎరీనా కొండ అంచుల్లో అక్కడక్కడా వన్యప్రాణులకు నీటి సదుపాయం కల్పించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.


హెల్త్ ఎరీనా వాకింగ్ ట్రాక్ వద్ద మృతి చెంది ఉన్న కనుజు పిల్ల

పాత పెన్షన్ స్కీమ్ సాధించే వరకూ పోరాటం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ



సమావేశంలో మాట్లాడుతున్న అజశర్మ

ప్రజాశక్తి -గోపాలపట్నం, కరాస : పాత పెన్షన్ స్కీం సాధించేంతవరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పోరాటాన్ని కొనసాగించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ పిలుపునిచ్చారు. పాత పెన్షన్ స్కీమ్‌కు నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్), ఏకీకృత పెన్షన్ స్కీమ్ (యుపిఎస్)లు ప్రత్యామ్నాయం కాదని తెలిపారు. డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యాన మర్రిపాలెం ఉడా కమ్యూనిటీ హాల్లో ఆదివారం 'యుపిఎస్ వరమా? శాపమా?' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అజశర్మ మాట్లాడుతూ, ఎన్‌పిఎస్‌తో పోలిస్తే పే అవుట్ పేరుతో పెన్షన్ ప్రకటించడమే యుపిఎస్‌లో సుగుణమని, దానిని పొందేందుకు అనేక షరతులు విధించారని చెప్పారు. ప్రభుత్వం ఇప్పుడున్న 14 శాతానికి మరో నాలుగున్నర శాతం కంట్రిబ్యూషన్ పెంచిందని, ఈ నిధులన్నీ కార్పొరేట్లకు ఉపయోగపడేటట్టు షేర్ మార్కెట్‌కు పంపిస్తున్నారని చెప్పారు. ఉద్యోగికి ఇస్తున్న ప్రభుత్వ షేర్‌ను ఒక దగ్గర పెడితే ప్రభుత్వం ప్రకటించిన యుపిఎస్ కంటే ఒపిఎస్ ప్రకారం పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వానికి భారం కాదని ఉదాహరణలతో వివరించారు. ఒకసారి యుపిఎస్‌లోకి వెళ్తే మరల తిరిగి వెనక్కి రాలేమని, ఏప్రిల్ 1వ తేదీన ఆప్షన్ ఇవ్వకుండా ఒపిఎస్ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

ఎన్ఎడిసిఇ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి.థామస్ మాట్లాడుతూ, ఐక్యంగా పోరాడితే ఒపిఎస్‌ను సాధించుకోగలమని చెప్పారు. ఎన్‌పిఎస్ వచ్చినప్పుడు ముందుగా వామపక్ష పార్టీలు, వామపక్ష ట్రేడ్ యూనియన్లు మాత్రమే గళమెత్తాయని గుర్తుచేశారు. పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జ్యోతీశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పోరాడి ఒపిఎస్ సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ, పెన్షన్ కార్మికుల హక్కు అని సుప్రీంకోర్టు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఐదేళ్లు ప్రజాప్రతినిధిగా గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు జీవిత కాలం పెన్షన్ పొందుతున్నా, ఏళ్ల తరబడి సేవలందించిన ఉద్యోగులకు దానిని లేకుండా చేయడం దుర్మార్గమని చెప్పారు. సుమారు కోటి మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన రూ.11 లక్షల కోట్లను షేర్ మార్కెట్‌లో పెట్టడమంటే జూదం ఆడటమేనని పేర్కొన్నారు. ఒపిఎస్ కోసం పోరాడాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. విశాఖ రక్షణ రంగ కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేయడం కోసం పది రోజులు పాటు ప్రచారం చేయాలని అనుబంధ యూనియన్లకు పిలుపునిచ్చింది. ఎన్ఎడిలో సస్పెండ్ అయిన 36 మందిని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వై.రాజేష్, ఆర్.శ్రీనివాస్, కె.శ్రీనివాసరావు, జి.అరుణ్‌కుమార్, ఎ.సునీల్‌కుమార్, అహ్మద్, భాను, జి.బిర్లా, వై.శేఖర్ పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : సమగ్ర శిక్ష ద్వారా 2012 నుంచి ఆర్ట్, వర్క్, పిఇటిలుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, అది సాధ్యం కాకపోతే కనీసం సమాన పనికి సమాన వేతనం (ఎంటిఎస్) వర్తింపజేయాలని ఎపి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. పౌర గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ వర్క్, ఆర్ట్, పిఇటి ఇన్‌స్ట్రక్టర్ల యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ విశాఖ ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 5800 మంది ఉపాధ్యాయులు, 460 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ ఉపాధ్యాయులకు బోధన చేసేందుకు తగిన విధంగా సిలబస్ లేకపోవడం, బోధన పనికంటే ఇతర పనులు ఎక్కువగా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జారీ చేసిన జిఒ ప్రకారం ఇఎస్ఐ, ఇపిఎఫ్ ప్రయోజనాలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, యూనిటీ టీం స్టేట్ అసోసియేట్ చైర్మన్ సైకం శివకుమారిరెడ్డి, విశాఖ జిల్లా అధ్యక్షుడు రవిచంద్, చైర్మన్ ఎస్.నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ మంది పిల్లలను కంటే పోషించేదెలా?

ప్రజాశక్తి-మాధవధార : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల కాలంలో ఎక్కువ మంది పిల్లలను కనాలంటూ ప్రకటనలు చేస్తున్నారని, ఎక్కువమంది పిల్లలను కంటే వారిని పోషించేది ఎలా అనే ఆలోచన సామాన్య ప్రజలను వేధిస్తోందని పిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు పేర్కొన్నారు. ఒకరిద్దరు పిల్లలతోనే ఇబ్బందులు పడుతున్న నేటి కాలంలో ఎక్కువ మంది పిల్లలను పోషించడం ఎలా అనేది పాలకులు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తర భారతం కంటే దక్షిణ భారతంలో జనాభా తక్కువగా ఉండటంతో ఇక్కడ ఎంపీల సంఖ్య తగ్గుతుంది కాబట్టి ఎక్కువ మంది పిల్లలను కనాలని కోరుతుండడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఎక్కువ మందిని కని, వారిని సుఖంగా పోషించే స్థితిలో నేటి సమాజం లేదని తెలిపారు. ఎంపీ సీట్ల కోసం ఎక్కువమంది పిల్లలను కనడం ఒకటే మార్గం కాదని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ఉత్తర, దక్షిణ భారతాలలో సమానంగా ఎంపీ సీట్లు వచ్చేలా ప్రయత్నాలు సాగించాలని సూచించారు. ఎక్కువమంది పిల్లలను కనాలన్న ప్రతిపాదనలను చంద్రబాబు, స్టాలిన్ వెనక్కి తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

కాంట్రాక్టు కార్మికులకు బలవంతపు వైద్య పరీక్షలు ఆపాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులకు బలవంతపు వైద్యపరీక్షలు ఆపాలని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పెదగంట్యాడ హౌసింగ్ బోర్డు వద్ద గల సిడబ్ల్యూసిలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, గేటు పాస్ రెన్యూవల్‌కు వెళ్లినప్పుడు వైద్య పరీక్షలు చేసుకుంటేనే రెన్యూవల్ చేస్తామనడం పచ్చి దుర్మార్గం అన్నారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి చేపడుతున్న ఈ వైద్య పరీక్షలకు వెళ్లవద్దని పిలుపునిచ్చారు. కార్మికుల తొలగింపు ఆపకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. ఇప్పటివరకు తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. యాజమాన్యం చర్యలకు నిరసనగా ఈ నెల 18వ తేదీన ఇడి వర్క్సు వద్ద భారీ ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, ఎల్.సోంబాబు, కె.వంశీ, కోన రమణ, పి.గురునాద్, డి.ఆనంద్, ఉమ్మిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రోడ్డు



ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-పెందుర్తి : మండలంలోని జెర్రిపోతులపాలెం నుండి మేఘాద్రి రిజర్వాయర్ మీదుగా ఉన్న రోడ్డు రాళ్లు తేలి ఉండటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడినప్పుడు రాకపోకలకు మరీ ఇబ్బంది ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 15 సంవత్సరాల నుండి ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మేఘాద్రి రిజర్వాయర్‌ను చూడ్డానికి చాలామంది దూర ప్రాంతాల నుంచి వస్తారని, వారికి కూడా ఈ ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సుమారు రూ.2 కోట్లు మంజూరైందని, రోడ్డు పనులు త్వరలో ప్రారంభవుతాయని కూటమి నాయకులు చెబుతున్నారు. పనులు చేపడితే రోడ్డుకు మహర్దశ కలిగినట్లేనని స్థానికులు చెబుతున్నారు. ఈ రోడ్డు వేస్తే 14 గ్రామాలకు రాకపోకలకు బాగుంటుందని జనసేన నాయకుడు గల్లా శ్రీనివాసరావు తెలిపారు.

టెన్త్ పరీక్షా కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి -గోపాలపట్నం : పదో తరగతి పరీక్షా కేంద్రాలను జిల్లా పరీక్షల అధికారి దేవానందరెడ్డి సందర్శించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఇఒ ఎన్.ప్రేమకుమార్, డివైఇఒ సోమేశ్వరరావు, మురళి, ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, చీఫ్ సూపరింటెండెంట్ కప్పల ప్రసాద్, విఒ శైలజ, పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గణబాబు

'చంద్రబాబుతో సుస్థిర పాలన'

ప్రజాశక్తి -గోపాలపట్నం : సుస్థిర పాలన అందించడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు అన్నారు. చంద్రబాబు 75 సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు 47 సంవత్సరాల రాజకీయ జీవితంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, కూటమని నాయకులు నరిపిన్ని సత్తిరాజు, యలమంచిలి ప్రసాద్, నాయుడు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి



అభివాదం చేస్తున్న జాతీయ బిసి సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి-సీతమ్మధార : జాతీయ బిసి సంక్షేమ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు కోరారు. పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బిసిలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని, బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని, బిసిలను అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. అనంతరం జాతీయ బిసి సంక్షేమ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులుగా నక్కల్లా నరసింహారావు నియమించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నాయకులు నూకాలమ్మ, మల్లేష్, నాగేశ్వరరావు, వేణు, రమణ పాల్గొన్నారు.

అద్దెకొచ్చే వారితో అప్రమత్తం : సిఐ

ప్రజాశక్తి -ఆనందపురం : ఇళ్లకు అద్దెకొచ్చేవారు, కొత్తవారితోనూ అప్రమత్తంగా ఉండాలని ఆనందపురం సిఐ వాసునాయుడు సూచించారు. ఆనందపురం పోలీస్ స్టేషన్లో ఆదివారం ఇళ్ల యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా అద్దెకు దిగిన వారి వివరాలను ప్రతి ఒక్కరూ ఉంచాలన్నారు. ఇల్లు అద్దెకిచ్చిన అనంతరం కొత్తవారెవరైనా వారి ఇంటికొస్తే ఆ వివరాలు కూడా ఇంటి యజమానులు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు నిలయాలుగా గృహాలు మారుతుండటంతో అవగాహన కల్పిస్తున్నట్లు సిఐ తెలిపారు.

అక్కయ్యపాలెంలో ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ



ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని అక్కయ్యపాలెంలో ఆదివారం ఆవిష్కరించారు. నందమూరి తారక రామారావుపై ఉన్న అభిమానంతో అప్పాజీ తన సొంత ఖర్చుతో ఈ విగ్రహాన్ని ప్రతిష్టించారని వక్తలు కొనియాడారు. కొయిలాడ వెంకటేష్ నేతృత్వంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, కార్పొరేటర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ ఆశయాలను కొనసాగిస్తూ, ప్రజాసేవను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు.

విద్యుత్ బిల్లుల భారంపై గగ్గోలు

• ప్రజా చైతన్యయాత్రలో సిపిఎం బృందానికి సమస్యలను విన్నవించిన ప్రజానీకం



అనకాపల్లిలో విద్యుత్ బిల్లులు చూపిస్తున్న వినియోగదారులు

ప్రజాశక్తి- అనకాపల్లి : వినియోగం కంటే అదనంగా వస్తున్న అధిక విద్యుత్ ఛార్జీల భారంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు వినియోగదారులు సిపిఎం బృందం వద్ద తమగోడు వెల్లబోసుకున్నారు. ఆదివారం సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా అనకాపల్లి గవరపాలెంలో ఇంటింటా పర్యటించి, సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎక్కువమంది ప్రజలు విద్యుత్ బిల్లులు బాగా ఎక్కువ వస్తున్నాయ వాపోయారు. మున్సిపాలిటీ కుళాయి కనెక్షన్ ఉన్నప్పటికీ నీరు రావడంలేదని, దీ ఎన్ని మార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా వచ్చి పరిశీలన చేసి వెళ్లారే తప్ప, సమస్య పరిష్కారం చెయ్యలేదన్నారు. ఇప్పటికీ తామంతా మున్సిపల్ వాటర్ టాక్స్ కడుతున్నామని, అయినప్పటికీ నీరు రాలేదని ఆందోళన వెలిబుచ్చారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కొణతాల త్రినాధ్ ,కాళ్ల తేలయ్య బాబు, పెంటకోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

11వారాలుగా అందని ఉపాధి బిల్లులు

కె..కోటపాడు : మండలంలోని వారాడ.,అనంతపురం, వి సంతకాలము, ఆర్‌వై అగ్రహారం, పోతన వలస, సూరెడ్డిపల్లి గ్రామాలలో సిపిఎం జిల్లా నాయకులు గండి నాయనబాబు ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వి సంతపాలెం ఎస్సి కాలనీలో తమకు 11 వారాల ఉపాధి బిల్లులు ఇవ్వలేదని, అదే కాలనీలో మచ్చ పైడితల్లమ్మకు రూ.12968, కె. గణేష్ రావుకు రూ.9952 విద్యుత్ బిల్లు వచ్చిందని సిపిఎం నేతల వద్ద గోడు వినిపించారు. 200 యూనిట్ల వరకు ఎస్సిలకు విద్యుత్తు ఉచితమని చెప్పి, ఇప్పుడు వేలల్లో బిల్లు చెల్లించాలని నోటీస్ ఇవ్వడంపై నాయనబాబు ఆవేదన వ్యక్తం చేశారు.

అదే కాలనీలో మంచినీటి కుళాయిలు సరిపడా లేవని, బోర్లు పాడైనా పట్టించుకునే దిక్కులేదని విన్నవించారు. ఉపాధి బిల్లుల సమస్యపై ఎపిఒ అప్పలరాజుకు ఫోనుచేసిన నాయనబాబు, వాకబుచేసి వెంటనే బకాయి చెల్లించాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి ఈర్ల నాయుడుబాబు మాట్లాడుతూ గోవాడ సుగర్స్ సమస్యలు, బకాయిలపై ఈనెల 21న సుగర్ ఫ్యాక్టరీ వద్ద మహాధర్నాలో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమం లో ఎర్ర దేవుడు. వనము సూర్య నారాయణ. ఈర్లే సూర్యనారాయణ, సబ్బవరపు ముత్యాల నాయుడు. రంగళిదేవి, సూరెడ్డి దేవుడమ్మ, బొడ్డి దేవుడుబాబు, బొడ్డు అచ్చుబాబు, సూరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.



కె.కోటపాడులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నాయనబాబు

ఖాళీ బిందెలతో మహిళల స్వాగతం

రాంబిల్లి : మండలంలోని జడ్ చింతవా పంచాయతీ శివారు లోవపాలెం, గజరెడ్డిపాలెం గ్రామాలలో సిపిఎం నాయకులు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పర్యటించారు. లోవపాలెం గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో స్వాగతించి, కాలనీ ఏర్పడినప్పుడు నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు, నేతలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు అన్నారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు మాట్లాడుతూ మండల కేంద్రానికి చేరువలోఉన్న లోవ-పాలెంలో తాగునీటి కష్టాలపై అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. అతి దగ్గరలో ఉన్న ఈ గ్రామానికి త్రాగునీరు అందించక పోవడం అత్యంత దుర్మార్గమన్నారు. సెజ్ కోసం వందల ఎకరాల భూములిచ్చిన నిర్వాసిత గ్రామం లోవపాలంలో సిఎస్ఆర్ నిధులతోనైనా తాగునీటి సౌకర్యాన్ని కల్పించాల్సి ఉండగా, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.తాగునీటి సమస్యపై తక్షణం స్పందించకుంటే, గ్రామ సచివాలయాల వద్ద, మండల కార్యాలయాల వద్ద ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగ మంత్రి నారాయణ రావు, ఎర్రి పిల్లి రాము, మహిళలు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మళ్లీ ఆగిన గోవాడ సుగర్స్ క్రషింగ్

ప్రజాశక్తి -చోడవరం : గోవాడ చక్కెర కర్మాగారంలో శనివారం అర్ధరాత్రి నుంచి సుగర్స్ క్రషింగ్ మళ్లీ నిలిచిపోయింది. తరచూ వివిధ సాంకేతిక కారణాలతో గానుగాటకు అంతరాయం కలుగుతుండడంతో రైతులు, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. మరో 24గంటల వరకు క్రషింగ్ పునరుద్ధరణకు అవకాశం లేకపోవడం ఫ్యాక్టరీ వద్ద ఉన్న చెరుకుబండ్లన్నిటిని వెంకన్నపాలెం యార్డుకు తరలించారు. గోవాడ సుగర్స్‌లో తరచూ సమస్యలు సమస్యలు తలెత్తడంతో దీని ప్రభావం పంచదార ఉత్పత్తిపై పడి గణనీయంగా తగ్గిపోయింది. 70 వేల టన్నులు క్రషింగ్ జరిగితే 38 వేల బస్తాలు పంచదార వచ్చిందంటే రికవరీ ఏ మేరకు తగ్గిందో చెప్పవచ్చు కనీసం ఆరు శాతం పంచదార కూడా దిగుబడి రాలేదు. గతంలో టన్ను చెరుకు క్రషింగ్ జరిపితే దాదాపు 95 కిలోల పంచదార తయారయ్యేది, ప్రస్తుతం 60 కేజీలు కూడా రాకపోవడంతో ఈ ఏడాది నష్టాలు ఏ విధంగా ఉంటాయో ఇట్టే అర్థమవుతుంది. మంచి రికవరీ సాధించినప్పుడే రైతులకు పూర్తిస్థాయిలో బట్వాడా చేయలేని పరిస్థితి ఫ్యాక్టరీకి, ఉన్నప్పుడు ఉత్పత్తి తగ్గిన తర్వాత ఏ విధంగా రైతులకు పేమెంట్లు చెల్లిస్తారని ప్రశ్నార్థకంగా మారింది. ఫ్యాక్టరీ స్థితిగతులపై అధ్యయనం చేసి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ఇటీవల ఫ్యాక్టరీని సందర్శించిన సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ ద్వారా తెలియజేసిన సంగతి తెలిసిందే, ఈ నేపథ్యంలో ఈనెల 21న చెరుకు రైతుల ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నాకు పిలుపునిచ్చారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న జెడ్‌పి మాజీ ఛైర్‌పర్సన్ భవాని

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా పరిషత్ మాజీ ఛైర్పర్సన్ లాలం భవాని, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, ,పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజన్న రమేష్ కుమార్ అన్నారు. ఆదివారం అచ్యుతాపురంలో రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వసంత వాడ దిన్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు కులుకులూరి విజయరామరాజు, జిల్లా కార్యాలయ కార్యదర్శి ఎపిఎం సత్యనారాయణ, జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షులు సేనాపతి నాగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, మాజీ మండల అధ్యక్షులు రవిరాజు, సీనియర్ నాయకులు రవిరాజు ,రఘు రాజు, మండల తెలుగు యువత అధ్యక్షులు అజయ్, రాష్ట్ర ముత్యకార అధికార ప్రతినిధి దేవుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

50 మేకలు సజీవ దహనం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని పెదపూడి గ్రామపంచాయతీ శివారు రాజుపాలెం లో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన నమ్మి చిలుకు, నమ్మి పైడయ్యకు చెందిన మూడు పశువుల పాకలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో వీరికి చెందిన 50 పైగా మేకలు సజీవ దహనమయ్యాయి. జీవనాధారంగా పెంచుకునే మేకలు అగ్నిప్రమాదంలో కాలి బూడిదవ్వడంతో బాధిత కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆస్తి నష్టం సుమారు రూ.ఐదు లక్షల పైగా ఉంటుందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



అగ్నిప్రమాదంలో బూడిదైన పాకల్లో సజీవ దహనమైన మేకలు

70 మందికి ఉచిత కంటిపరీక్షలు



కంటిపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలం,లోని వేచలం గ్రామంలో ఆదివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ట్రస్ట్ సభ్యులు రెడ్డి శేషు మాస్టార్ ప్రారంభించారు. కంటి వైద్య శిబిరంలో 70 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఐడ్రాప్స్ అందించడమైనది. దృష్టి లోపము న్నట్లు గుర్తించిన 38 మంది రోగులను కంటి ఆపరేషన్స్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్‌లో తరలించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులకు వైద్య సేవలు అందిస్తున్న అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ బందాన్ని స్థానికులు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో ˊంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు డాక్టర్ దివ్య, క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్, ట్రస్ట్ ఛైర్మన్ గొంప వెంకటరావు, వేచలపు నాని, రెడ్డి దస్వంత్, చప్పా శివశంకర్, రెడ్డి భానుప్రకాష్ పాల్గొన్నారు.

సాంకేతిక పురోగతిలో యువత పాత్ర కీలకం



బాల ప్రసాద్, డాక్టర్ సురేష్‌లను సత్కరిస్తున్న డైట్ ప్రతినిధులు

ప్రజాశక్తి -అనకాపల్లి : సాంకేతిక పురోగతి, అభివృద్ధిలో యువతదే కీలకపాత్ర అని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్, గ్లోబల్ హెడ్ ఆఫ్ టెక్నాలజీ అడ్వైజర్ బాలప్రసాద్ పెద్దిగారి అన్నారు.ఆదివారం స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీలో ట్రెండ్స్ ఇన్ కంప్యూటింగ్ టెక్నాలజీ అంశంపై జాతీయసదస్సు ముగిసింది. ఈ సందర్భంగా యాక్సెంచర్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ సురేష్ అడిగా, కంప్యూటర్ సొసైటీ అఫ్ ఇండియా హెడ్ అకాడమిక్ అండ్ ఇండస్ట్రీ కౌన్సిల్, చంద్రశేఖర్ దశక, డైట్ ఛైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, సదస్సు కన్వీనర్ డా. కె. సుజాత మాట్లాడారు.

బాల ప్రసాద్ మాట్లాడుతూ, లావాదేవీల వ్యవస్థలలో టెక్నాలజీ వినియోగం దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. డాక్టర్ సురేష్ అడిగా మాట్లాడుతూ, ఓపెన్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిజిటల్ వనరులను బలోపేతం చేయడానికి డీసెంట్రలైజ్డ్, ఇంటర్‌ఆపరబుల్ మోడల్స్‌ను మన దేశం అమలు చేస్తోందన్నారు. చంద్ర దశాక మాట్లాడుతూ, భారత ప్రభుత్వ డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి చేయబడిన సురక్షితమైన క్లౌడ్ ఆధారిత డాక్యుమెంట్ పరిరక్షణ చేస్తుందన్నారు. దాడి రత్నాకర్ మాట్లాడుతూ, జాతీయ సదస్సు ద్వారా సాంకేతికత, పరిశోధన, పరిశ్రమలతో విద్యార్థుల అనుసంధానం బలపడిందన్నారు.డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠ రావుకాన్ఫరెన్స్, వర్కుషాప్స్, సాంకేతిక కార్యకలాపాలు నిర్వహించటం వలన ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, రీసెర్చ్ అండ్ స్కిల్ డెవలప్మెంట్ వలన నిరుద్యోగ శాతం తగ్గించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ కె..సుజాత ,సెషన్ ఛైర్మన్‌గా డాక్టర్ ఎం శ్రీనివాసరావు, డాక్టర్. పి పూర్ణ ప్రియ, డాక్టర్ రమణ కుమార్ జోగా, డాక్టర్ బి అంజనీ కుమార్,డాక్టర్. ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

19న వడ్డాదిలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది జంక్షన్‌లోని వీరవిల్లి రోడ్ వెంకట పద్మ మెడికల్ షాప్ వద్ద ఈనెల 19న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎ.శివకుమార్ తెలిపారు. ఆదివారం వడ్డాదిలో దీనికి సంబంధించిన కరపత్రాలను స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్య బాబు ఆవిష్కరించారు. విశాఖ శంకర ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించే వైద్యశిబిరంలో ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి విశాఖలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు .రోగులు ఆరోగ్యశ్రీ, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్, దీర్ఘకాలిక రోగాలకు వాడే మందులు, చీటీలతో రావాలని సూచించారు. టిడిపి నేతలు దొండా నరేష్, సాయం శేషు, ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు

50 ఏళ్లు నిండిన టైలర్లకు పించను ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న టైలర్ల సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి - యలమంచిలి : రెడీమేడ్ దుస్తుల విస్ఫోటనంతో జీవనోపాధి దుర్భరమైన టైలర్లకు 50ఏళ్లకే ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛను అందజేసి ఆదుకోవాలని రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అతికినశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం . యలమంచిలి పివి కాంప్లెక్స్‌లో మండల టైలర్స్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, టైలరింగ్ వృత్తిలో కుటుంబాన్ని పోషించే ఆదాయం సమకూరని పరిస్థితుల్లో అనేక మంది ఇతర వృత్తులు, వ్యాపకాల్లోకి వలస పోతున్నారన్నారు. టైలర్లకు 150 యూనిట్లు విద్యుత్ ఉచితంగా సరఫరా చేయాలని, ఆధునికి టైలరింగ్ మిషన్లు కొనుకోలుకు రాయితీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు వియ్యపు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ శ్రమ పథకంలో టైలర్లు అందరూ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన కార్యవర్గం ఎన్నిక జరగ్గా, గౌరవ అధ్యక్షులుగా డి. సూరిబాబు, అధ్యక్షులుగా వియ్యపు సత్యనారా యణ, ప్రధాన కార్యదర్శిగా దుప్పట్లు శేషబాబు, ముహిళా అధ్యక్షురాలిగా వేగి విజయ, కె.బాధారరావు, వై.నాయుడు, పసగడుగుల రమణ, సలహాదారుగా మళ్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

హాల్ టికెట్లు ఇవ్వకుంటే చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఫీజు బకాయిలు ఇతర కారణాలతో విద్యార్థుల 10వ తరగతి పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లు నిలుపుదల చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు హెచ్చరించారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ విద్యాసంస్థయినా, నిర్వహకులైనా విద్యార్థులు పరీక్షకు హాజరయ్యే అవకాశం లేకుండా వారి హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినా, అటువంటి ఫిర్యాదులు వచ్చినా అటువంటి విద్యాసంస్థలపై కఠిన చర్యలు తప్పవన్నారు. తగిన విచారణ చేయించి, ఆ పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తేవాలన్నారు.

అవగాహనతో చట్టాల సద్వినియోగం

ప్రజాశక్తి -సీలేరు: రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఆలపాటి గిరిధర్ అన్నారు. ఆదివారం సీలేరు జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ, లక్ష్యాన్ని నిర్ధేశించుకుని, పట్టుదలతో కృషి చేస్తే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చన్నారు. చట్టాలు, హక్కులు, బాధ్యతలపై ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్గించేందుకు జిల్లావ్యాప్తంగా న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నా మన్నారు. పాఠశాలల్లో, పనిప్రదేశాల్లో మహిళలు, బాలికలు లైంగిక వేధింపులకు గురైతే, బాధ్యులపై పోక్సోచట్టం కింద కేసులు నమోదు చేస్తామన్నారు. లైంగిక వేధింపుల ఫిర్యాదులను పోలీసుశాఖకే కాకుండా, ఐసిడిఎస్, రెవెన్యూ, విద్యా, మరే ఇతరశాఖకైనా నేరుగా ఫిర్యాదు చేయవచ్చని, కోర్టు ద్వారా వస్తే కేసులు తీసుకుంటామన్నారు. తప్పుడు ఫిర్యాదులతో అబ్బాయిలను ఇబ్బందులు పెడితే, తిరిగి చర్యలుంటాయన్నారు.

జిల్లా న్యాయ సేనాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఎంవి. వెంకటశేషమ్మ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, డ్రగ్స్‌కు సంబంధించి ఫిర్యాదులపై పోలీసులతోపాటు అన్ని శాఖల అధికారులు స్పందిస్తారన్నారు. చింతపల్లి సివిల్ జడ్జి ఎం.రోహిత్, డిఇఒ బ్రహ్మాజీరావు, సిడిపిఒ లక్ష్మీదేవి, జికెవీధి సిఐ వరప్రసాద్, తహశీల్దార్ రామకృష్ణ, ప్రిన్సిపల్ బుచ్చిబాబు, హెచ్‌ఎం నాగ శకుంతల,నాగభూషణం, వైద్యాధికారులు ఖాదర్ మస్తాన్ వల్లి, హిమబిందు సర్పంచి దుర్గో, పంచాయతీ కార్యదర్శి పరుశురాం పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలను వెంటనే చెల్లించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి



ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

ప్రజాశక్తి- పరవాడ : ఉపాధి హామీ కూలీలకు బకాయి పడ్డ ఏడు వారాలు వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పెదముసిడి వాడ పంచాయతీ గండివాని పాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి వేతన బకాయి లపై ఆందోళన చేపట్టి, నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ, ఏడు వారాలు నుండి ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో, పనులు చేసినా కూలీల కుటుంబాలుల పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.ఉపాధి కూలీలుకు పేస్లిప్పులు అందజేసి, వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడేళ్లుగా ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధుల కోతపెట్టి, మెటీరియల్ కాంపోనెంట్‌కు ప్రాధాన్యతనివ్వడంతో కూలీలకు పనులు దొరకని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు అంతేకాక చట్టంలోని నిబంధనల మేరకు గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసిన కూలీలకు 20 శాతం సమ్మర్ ఎలవెన్సులు ఇచ్చేవారని దానికీ మంగళం పాడేయడం దుర్మార్గమన్నారు. కూలీలకు గునపాం, పార వంటి పనిముట్లు, పనిప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీటి సౌకర్యం ఇలా కల్పించాల్సిన సౌకర్యాలను లేకుండా చేసి పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూడడం సరికాదన్నారు. వేసవి అలవెన్స్‌ను కూలీ డబ్బులతో కలిసి 30శాతం పెంచి ఇవ్వాలని, గతంలోమాదిరిగా అన్ని సౌకర్యాలను కల్పించాలని, నిబంధనల మేరకు రెండు వారాల్లో బిల్లులు చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. జాబ్‌కార్డున్న కుటుంబాలకు 200 పనిదినాల కల్పనతో పాటు రోజువారీ కూలీ రూ.600 చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు అప్పారావు, నాగలక్ష్మి, పి నాగమణి పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల నిబంధనలన్నీ పక్కాగా పాటించాల్సిందే

డిఇఒ అప్పారావునాయుడు

ప్రజాశక్తి -అనకాపల్లి : జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి బోర్డు, ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షల నిర్వహణలో నిబంధనలన్నీ పక్కాగా పాటించాల్సిందేనని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా టెన్త్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనకాపల్లి, భీమునిగుమ్మం జివిఎంసి అంబేద్కర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల నిర్వహణ అధికారులు, స్క్వాడ్ బందాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, పరీక్షల నిర్వహణపై సూచనలు చేశారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఏ రూపంలో ఎవరు భాగస్వాములైనా కఠిన చర్యలకు బాధ్యులు అవుతారనిహెచ్చరించారు. నిబంధనలన్నీ పరిశీలించి, పరీక్షల నిర్వహణ పక్కాగా జరపాలన్నారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాలతో పాటు పరిసరాల్లో కూడా ఎక్కడ ఎటువంటి ఇబ్బందికరమైన సామగ్రి లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని దష్టిలో పెట్టుకుని కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, వాచ్ లు తదితర ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందరూ హాల్ టికెట్లను ముందుగా తనిఖీ చేయాలన్నారు. అభ్యర్థులందరినీ తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. పదవ తరగతి బోర్డు, ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పి అప్పారావు, పరీక్షలు విభాగం సహాయ సంచాలకులు ఎ.శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

ప్రజాశక్తి- కె.కోటపాడు: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజల పక్షాన సిపిఐ కార్యకర్తలు నిరంతరం పోరాటం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలో రామచంద్రపురంలో సిపిఐ తొమ్మిదవ మండల మహాసభలో బాలేపల్లి మాట్లాడుతూ, పేదల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన వందేళ్ల చరిత్ర, ఘనత కమ్యూనిస్టు పార్టీలకు ఉందన్నారు చట్ట సభల్లో సీట్లు కోసం పాకులాడకుండా, పేదలు, వారి సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాటం చేస్తోందన్నారు. రాజ్యాంగాన్నే మార్చేయాలని చూస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలు ప్రమాదరకమని, దానిపై ప్రజలను చైతన్యపరుస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పార్టీ . జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, వేచలపు కాసుబాబు, రెడ్డిపల్లి అప్పలరాజు పొంతపల్లి రామారావు సిముసురు సూర్యనారాయణ, చప్ప కోటి, దమ్ము ముత్యాలనాయుడు పాల్గొన్నారు. నూతన కార్యదర్శిగా దేముడుబాబుతోకూడిన మండల కమిటీని ఎన్నుకున్నారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు : ఎస్‌పి



ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లాలో మొత్తం 107 పరీక్షా కేంద్రాల్లో 22,042 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.పరీక్షా కేంద్రాలకు సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు.విద్యార్థులు ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, .పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్షా కేంద్రం నుండి బయటికి వెళ్లడానికి అనుమతి లేదన్నారు

.సున్నితమైన పరీక్షా కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, పరీక్ష కేంద్రాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్ తప్ప ఎవరూ మొబైల్ ఫోన్ తీసుకురావద్దని సూచించారు. హాల్ టికెట్ తప్ప, సెల్‌ఫోన్‌లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్ డివైజులు, స్మార్ట్ వాచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసివేయాలని ఆదేశించారు.. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ లేదా అనైతిక చర్యలకు పాల్పడితే, ఏపీ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ మాల్ ప్రాక్టీస్ అండ్ అన్‌ఫైర్ మీన్స్) యాక్ట్, 1997 ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

డిఎస్‌సి వాగ్ధానాన్ని నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి చోడవరం/ రూరల్ : మెగా డిఎస్‌సి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని నిరుద్యోగ జెఎసి కన్వీనర్ పుల్లేటి గణేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం రోజున మొట్టమొదటి సంతకం మెగా డిఎస్‌సిపై పెట్టి, ఇప్పటికే 9 నెలలు గడిచినా, ప్రకటనలే తప్ప ఇప్పటి వరకు మెగా డిఎస్‌సి అమలుకు నోచుకోలేదన్నారు. నిన్నటి వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అంటూ కాలయాపన చేసి,. ఇపుడు ఎస్‌సి వర్గీకరణ అంటూ మెలిక పెట్టడం సరికాదన్నారు. 2018 నుండి లక్షల మంది నిరుద్యోగ ఉపాధ్యాయులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారని, వారికి ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, తక్షణమే డిఎస్‌సి షెడ్యూల్‌ను ప్రకటించి, వచ్చే విద్యాసంవత్సరం జూన్‌నాటికి నియామకాలు పూర్తిచేయాలని కోరారు. న్యాయపరమైన చిక్కులు లేని డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం నిరుద్యోగ అభ్యర్థులు ఎదురుచూస్తున్నారన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న రత్నాకర్

ప్రజాశక్తి - కశింకోట : కసింకోట గ్రామంలో బుదిరెడ్డి చిన్న ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఆదివారం ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో దాహార్తితో అల్లాడే ప్రజలు, బాటసారులకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని,బుదిరెడ్డి చిన్నను అభినందించారు. కార్యక్రమంలో వేగి దొరబాబు,పెంటకోట రాము వేగి పాపారావు, కమిటీ గోంతిన గోపి, గొంతిన రమణ, సిద్దిరెడ్డి శ్రీను, గొంతిన శ్రీను గొంతున లోవ అప్పారావు, వేగి వెంకట్రావు,వేగి కష్ణ, కోయిలాడ నాగు, పెంటకోట సత్తిబాబు పాల్గొన్నారు.

మూగజీవాలకు నీటి పాత్రలు

కె.కోటపాడు : మానవత్వంతో మూగ జీవాల దాహార్తి తీర్చుతున్న జర్నలిస్ట్ కుబిరెడ్డి రాధాకృష్ణ, వరలక్ష్మి దంపతుల సేవ ఆదర్శనీయమని సత్యసాయి సేవాసంస్థల జిల్లా సహ సమన్వయకర్త కన్నూరు అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కింతాడ పంచాయతీ కూండ్రపువానిపాలెం ఏటా మాదరిగానే ఈ సంవత్సరం కూడా వేసవిదష్ట్యా తమ ఇంటివద్ద మూగ జీవాలకు చలివేంద్రాన్ని ప్రారంభించారు. రాధాకృష్ణ మాట్లాడుతూ, వేసవిలో పక్షులు, శునకాలు, ఇతర మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు పదేళ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతృప్తిగా ఉందన్నారు. కార్యక్రమంలో కుబిరెడ్డి సన్యాసినాయుడు, బండారు సూర్యప్రభ,కుబిరెడ్డి వరలక్ష్మి, అలుగోజు కనకరాజు పాల్గొన్నారు.



నీటి కుండీలు ఏర్పాటు చేస్తున్న రాధాకృష్ణ, వరలక్ష్మి దంపతులు

ముగిసిన వెంకన్న కల్యాణోత్సవం

ప్రజాశక్తి- వడ్డాది. : వడ్డాది వెంకటేశ్వర స్వామి 152వ వార్షిక కల్యాణోత్సవాలు ప్రశాంతంగా ముగిసాయి. ఈనెల 9న స్వామి దొంగ పెళ్లితో ఉత్సవాల ప్రారంభమై శనివారం రాత్రి పుష్పాంజలి సేవతో ముగిసాయి. అర్చకులు అంగర శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో వెంకటేశ్వరస్వామిని పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి పవళింపు సేవ నిర్వహించారు.చివరిరోజున రోజంతా గిరిజాంబగిరి భక్తులతో రద్దీగా కనిపించింది. పలు ఆధ్యాత్మిక సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుచ్చయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించారు.

అసంపూర్తిగా సబ్‌ట్రెజరీ భవనం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సబ్ ట్రెజరీ కార్యాలయం అసంపూర్తిగా నిలిచిపోయింది. గత ఏడాది మే నెలలో ప్రారంభించిన ఈ భవనాన్ని దాదాపుగా రెండు స్లాబ్‌లు పూర్తి చేశారు. బిల్లులు చెల్లింపులు కాకపోవడంతో గడచిన మూడు నెలలుగా పనులు ఆగిపోయినట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు. ఈ భవనానికి ఫినిషింగ్ వర్కులు, ఫ్లోరింగ్, వైరింగ్, ప్లంబింగ్ పనులు చేపట్టాల్సి ఉంది, ప్రస్తుతం సబ్ ట్రెజరీ కార్యాలయం అద్దె కొంపలో కొనసాగుతుంది. ప్రస్తుతం అద్దెకు ఉంటున్న కార్యాలయం చాలీచాలని భవనంలో ఉండడంతో సిబ్బంది పలువిధాలుగా ఇబ్బంది పడుతున్నారు.

ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులను వివరణ కోరగా బిల్లులు నేటికీ చెల్లింపు కాకపోవడంతో పనులు నిలిచిపోయినట్లు వెల్లడించారు. అధికారులు ఇప్పటికైనా నిర్మాణ పనులు ముందుకు సాగే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న భవనం

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆదేశాల మేరకు వైసీపీ నాయకులు అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పెదబొడ్డేపల్లి పెద్ద చెరువు వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు ఏకా శివ, నాయకులు భేతిరెడ్డి విజయ్, కణితి వాసు, నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : కలెక్టరేట్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా రెవిన్యూ అధికారి సత్యనారాయణరావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రా ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు గాంధేయమార్గంలో నిరాహారదీక్ష చేసి, ఆత్మబలిదానమే కారణమన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి పి.నాగేశ్వరరావు, సిఐలు రామకృష్ణారావు, మన్మథరావు, ఆర్ఎస్ఐ ఆదినారాయణ పాల్గొన్నారు. సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆలయం జంక్షన్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించి, అమరజీవికి భారతరత్న ప్రకటించాలని సంస్థ వ్యవస్థాపకులు బల్లానాగభూషణం డిమాండ్ చేశారు. అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపకులు ఆళ్ల ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు.

పొట్టిశ్రీరాములు భవన్, పిరాట్ల నరసింహమూర్తి మినీ కళ్యాణ మండపంలో నిర్వాహకులు పి. మూర్తి ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు జయంతి నిర్వహించారు. అమరజీవి వేషధారణ పోటీల్లో బాలలు, యువత ఉత్సాహంగా పాల్గొనగా, విజేతలకు బహుమతులు అందజేశారు.

కె. కోటపాడు : మండలంలోని చౌడువాడ శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం పద్మావతి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.



భీమిలిలో...

సబ్బవరం. : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా సబ్బవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వాసవి క్లబ్ సబ్బవరం రూరల్ యూనిట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని స్థానిక సీఐ పిన్నింటి రమణ ప్రారంభించారు. మూడు నెలలు పాటు కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు సంతోష్ గుప్త, జోనల్ చైర్ పర్సన్ బండారు వెంకట నాగ రామారావు, సన్యాసిరావు, సతీష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పిల్లలతో చదివించటం కార్యక్రమాన్ని చేపట్టారు.

భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డులోని పార్కులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు, కెఎస్ఆర్.కృష్ణారావు, డి.హరీష్, శంకరరెడ్డి

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ బి.అశోక్‌కుమార్, కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి స్వచ్ఛంద సేవకులు కొట్యాడ సత్యమూర్తి ఆధ్వర్యాన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జివిఎంసి వ్యయ పరిశీలకులు సి.వాసుదేవరెడ్డి, ఆఫీస్ ఇంచార్జ్ ఆనంద్, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో నివాళి అర్పిస్తున్న డిఆర్ఓ

పూర్వ విద్యార్థుల కలయిక



వడ్డాదిలో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేడి జడ్పిహెచ్ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలకయిను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సుమారు పాతిక సంవత్సరాల తర్వాత కలవడంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు. కష్టాల్లో ఉన్న తోటి మిత్రులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది హైస్కూల్లో టెన్త్ క్లాసులో టాపర్‌గా వచ్చిన విద్యార్థికి ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫీజు కడతారని మంచాల సత్తిబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎర్రంశెట్టి శ్రీను, తలారి శంకర్, కర్రీ గణేష్ (ముకుందపురంపురం సర్పంచ్), అడపా శ్రీను, చంటిగాడు యూత్, సాలాపు ముత్యాల నాయుడు, వేగి జగదీష్ పాల్గొన్నారు.

బుచ్చయ్య పేట : మండలంలో దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం తైపురం మరిడిమాంబ ఆలయం వద్ద కలుసుకున్నారు. సుమారు 18 సంవత్సరాల తర్వాత విద్యార్థులు కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో చదువుకున్న నాటి తీపి గుర్తులు పంచుకొని ఉత్సాహంగా గడిపారు.

విశాఖ కలెక్టరేట్: నగరంలో చారిత్రక గుర్తింపు కలిగిన ఎవిఎన్ కళాశాల హై స్కూల్ పూర్వ విద్యార్థులు 53 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకొని ఆనాటి ముచ్చట్లు పంచుకున్నారు. ఆదివారం 1971-72, 1972-73 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న వీరంతా స్థానిక పాంబీచ్ హెటల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని, తాము పాఠశాలలో చదువుకునే రోజుల్లో తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను తలుచుకున్నారు. అర్ధ శతాబ్దం తర్వాత ఇలా మిత్రులందరూ కలుసుకోవడం ఎంతో ఆనందదాయకమైన విషయమని, ఈ సమ్మేళనం నిర్వహించిన తమ మిత్రుడు కె.అప్పలరాజుకు, ఆతిథ్యం ఇచ్చిన తమ సహాధ్యాయి ప్రముఖ ఇఎన్ టి సర్జన్ డాక్టర్ ఎస్.సూర్యప్రకాశరావు కి కృతజ్ఞతా పూర్వక అభినందనలు తెలిపారు.



విశాఖలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



జెసిబితో చేపడుతున్న రోడ్డు పనులు

రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండలం శరభవరం నర్సీపట్నం రోడ్డు, నర్సీపట్నం చింతపల్లి రోడ్డు జంక్షన్ వరకు రోడ్డు మరమ్మత్తు పులు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రతీ రోజు ఈ రోడ్డుపై అధికంగా వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో రాతి క్వారీలతో రోడ్లు ధ్వంసమై వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో క్వారీ లారీలు తిరగడంతో రోడ్డు మరమ్మత్తుకి గురైంది. దీంతో, ఆర్అండ్‌బి అధికారులు రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభించారు. ఈ ప్రాంత ప్రజలు ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందులు పడేవారు. ఇకమీద ఈ రోడ్డు మరమ్మత్తులు అయితే ప్రయాణం సుఖమయంగా సాగుతుందని ప్రజలు భావిస్తున్నారు.



దాతను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

ఆలయానికి రూ.40 వేల విరాళం

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లిలో బండారు వీధిలో ఇటీవల కోదండరామ ఆలయాన్ని నూతనంగా నిర్మాణం చేపట్టి ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం నక్కపల్లి కి చెందిన నున్న సుధీర్ 40 వేలు రూపాయలు, బలారం గ్రామానికి చెందిన వానపల్లి త్రిమూర్తులు (బుజ్జి) 25 వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు దాతలను కమిటీ సభ్యులు సత్కరించారు.

మద్యం దుకాణాలపై నియంత్రణ ఏదీ : సిపిఎం

ప్రజాశక్తి- మాడుగుల: ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి మద్యం షాపుల పక్కన బార్లులా షాపులు ఏర్పాటు చేయడం తగదని సీపీఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి తెలిపారు. ఈనెల 15వ తేదీ శనివారం ప్రజాశక్తిలో ప్రచురితం అయిన బార్లు మాదిరిగా మద్యం షాపులు వార్తా కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేటు మద్యం దుకాణాలను ఏర్పాటు అయ్యాయని, గొలుసు దుకాణాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. మద్యం గొలుసు దుకాణాలు ఏర్పాటుకి సహకరించిన షాపు లైసెన్సులను రద్దు చేస్తామని ప్రభుత్వం హెచ్చరించినా స్పందన లేదన్నారు. లైసెన్సు మద్యం దుకాణాల పక్కనే బార్ అండ్ రెస్టారెంట్లుగా ఏర్పాటు చేసి మద్యం తాగేందుకు అవకాశం కల్పించడం సరికాదన్నారు. మద్యం దుకాణదారులపై అధికారులు పట్టించుకోకపోవడం లో ఉన్న మతలాబు ఏమిటని ప్రశ్నించారు. ఉదయం పది గంటలకు షాపు తెరిచి, రాత్రి పది గంటలకు షాపు మూసివేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ, ఎక్కడా అమలు కాలేదని మండిపడ్డారు. ఈ విషయం పై జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.


మహిళలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మహిళలకు కేన్సర్ పరీక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని జానకయ్యపేటలో ఆదివారం వేంపాడు వికాస తరంగిణి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యురాలు గుటూరు తేజ ఆధ్వర్యంలో మహిళలకు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేసి అవగాహన కల్పించారు. వికాస తరంగిణి సభ్యులు చిక్కాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఇప్పటివరకు పలు గ్రామాల్లో 1440 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు.మహిళా వైద్యులచే ప్రపంచ ఆరోగ్య సంస్థ ధ్రువీకరించిన వీఐఏ పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సమస్య ఎక్కువగా ఉన్నవారికి తదుపరి పరీక్షలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఆరోగ్య వికాస్ సభ్యులు కుసుమకుమారి, పద్మజ, హైమ, సుజాత,సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది వేడుకలను వైభవంగా జరుపుకోవాలి

-స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఉగాది వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు కోరారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, పూర్వం ఉగాది పండుగను ప్రతి గ్రామంలో జరుపుకునే వారని, ప్రస్తుతం పండుగలు క్రమంగా కనుమరుగవుతున్నట్లు తెలిపారు.నేటి తరం ఉగాది పండుగ ప్రాముఖ్యతను అర్థం చేసుకునేలా సంప్రదాయ పద్ధతిలో వేడుకలు నిర్వహించుకోవాలని సూచించారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని 101 పంచాయతీలలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలంతా సంబురంగా ఉగాదిని జరుపుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న అయ్యన్న


చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి -కొత్తకోట:అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు కొత్తకోట వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక గ్రంథాలయం ఆవరణలో ఉన్న అమర జీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్లబ్ సభ్యులు ఘనంగా నివాళు లు అర్పించారు. అనంతరం షిరిడి సాయిబాబా ఆలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్-రీజనల్ కార్యదర్శి పి.వి.ఎం. నాగజ్యోతి, కొత్తకోట వనిత క్లబ్ అధ్యక్షురాలు శోభారాణి, కార్యదర్శి వినీత పలువురు వాసవి క్లబ్ సభ్యులు అచ్చిరాజు, రమేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్:గొలుగొండ శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులచే పుస్తకాలు చదివించారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం


శిథిల భవనాన్ని చూపిస్తున్న సిపిఎం నేత చిరంజీవి

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం పెద్దపేట గ్రామంలోని యుపీ స్కూల్ శిథిలావస్థకు చేరింది. సిపిఎం మండల నాయకులు ఈరెల్లి చిరంజీవి ఆదివారం ఈ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. అనంతరం చిరంజీవి విలేకర్లకు తెలిపిన వివరాలు..ఈ భవన నిర్మాణం చేపట్టి సుమారు 40 సంవత్సరాలు కావస్తోంది. ప్రస్తుతం ఈ భవనం పడిపోయే పరిస్థితుల్లో ఉంది. ఈ పాఠశాలలో 18 మంది పిల్లలు చదువుతున్నారు. స్కూలు భవనం పడిపోయే పరిస్థితిలో ఉండటంతో పక్కనే ఉన్న ఎంపేట స్కూల్‌కి 18 పిల్లలు వెళుతున్నారని చిరంజీవి తెలిపారు. నెలకి ఒక విద్యార్థికి 200 చెప్పినా ఆటో కి ఇచ్చి వెళ్తున్నారన్నారు. ప్రభుత్వం పెద్దపేట గిరిజన గ్రామానికి స్కూల్ భవనం మంజూరు చేసి పిల్లలకు స్థానికంగా చదువుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.


ఊడి పడుతున్న భవనం పై పెచ్చులు

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు ఇస్తున్న స్నేహితులు

ప్రజాశక్తి -వడ్డాది: కష్టాల్లో ఉన్న మిత్రుడి కుటుంబానికి వారంతా తోడుగా ఉన్నారు. బుచ్చయ్య పేట మండలం వడ్డాది కేవీడి జడ్పీహెచ్ఎస్ స్కూల్లో 2008 -2009 విద్యా సంవత్సరంలో చదువుకున్న విద్యార్థులు ఉదారత చాటారు. బంగారు మెట్ట గ్రామానికి చెందిన మీసాల శివ గత వారంలో రైలు ప్రమాదంలో మరణించాడు. శివ కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించేవాడు. శివ మరణించడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. శివ మరణ వార్త విన్న తోటి మిత్రులు రూ.36,000 విరాళంగా తన భార్య కి అందించారు.

వెంకన్నను దర్శించుకున్న చీరాల ఎమ్మెల్యే

ప్రజాశక్తి- నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయాన్ని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదివారం సందర్శించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్రను వివరించారు.

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న వార్షిక తిరు కళ్యాణ మహోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయములో పుష్ప యాగోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అద్దాల మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులకు వివిధ రకాల పుష్పాలు, పండ్లతో అందముగా అలంకరించారు. ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు శేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.


వెంకన్న ఆలయంలో చీరాల ఎమ్మెల్యే కొండయ్య


వేడుకల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ:స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ మద్దిలపాలెం కృష్ణా కాలేజ్ రోడ్‌లోని మెయిన్ బ్రాంచ్ లో యుకెజి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో 70 మంది యుకెజి విద్యార్థులు రంగురంగుల గ్రాడ్యుయేషన్ డ్రెస్‌లలో తమ తల్లిదండ్రుల సమక్షంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. 2001లో స్థాపితమైన స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌లో విశేష గుర్తింపు లభించింది. ఈ పాఠశాలకు ప్రముఖుల నుంచి గుర్తింపు లభించింది. ఇదే విధంగా స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ గాజువాక బ్రాంచ్ లో కూడా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు మాట్లాడుతూ హొలిస్టిక్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యతను వివరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ మళ్ల వాణిశ్రీ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులకు అందిస్తున్న సహకారం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రేబాక గ్రామంలోని గూడపమ్మతల్లి ఆలయాన్ని ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మూడు దశాబ్దాల చరిత్ర వున్న ఈ ఆలయాన్ని శక్తి కేంద్రంగా మార్పు చేశారు.అష్టలక్ష్మీ సరస్వతీ, గాయత్రీ మందిరం, నవదుర్గలు, అప్సరసలు, నాగదేవత, సుబ్రహ్మణ్యస్వామి, కాల భైరవుడ , దత్తాత్రేయుడు, తదితర మందిరాలను ఇటీవల నిర్మించారు. శక్తి కేంద్రంగా నిర్మితమైన గూడపమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకోవడానికి అనేక ప్రాంతాల నుంచి భక్తులు రేబాక వస్తున్నారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

తాటిపూడిలో 200 ఎకరాల్లో ..

'భూమాత' సరికొత్త వెంచర్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భూమాత గ్రూపు సరికొత్త వెంచర్‌కు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో భూమాత గ్రూపు - ఎస్‌విఎన్ గ్రూపు సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన వెంచర్‌కు సంబంధించిన 'భూమాతాస్ ఎస్‌విఎన్ స్వప్నలోక్' బ్రోచర్‌ను ఆదివారం సాయంత్రం విశాఖపట్నంలోని సాయి ప్రియ రిసార్ట్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమాత మేనేజింగ్ డైరెక్టర్ తాళ్లూరి పూర్ణచంద్రరావు, ఎస్‌విఎన్ గ్రూప్ ఛైర్మన్ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ ఈ వెంచర్ విజయనగరం జిల్లాలోని తాటిపూడి వద్ద సుమారు 200 ఎకరాలలో 5 ఫేజ్‌లలో 1650 ప్లాట్స్‌గా వుడా అనుమతులతో అందరికీ అందుబాటు ధరలతో ఉండనుందన్నారు. ఈ వెంచర్‌లో ఇంతవరకు రియల్ ఎస్టేట్ రంగంలో ఎవ్వరూ కల్పించని సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్ సదుపాయాలతో సహా అన్నీ ఉంటాయన్నారు. ఈ వెంచర్ పూర్తిగా ఒక థీమ్డ్ ప్రీమియం రెసిడెన్షియల్ మెగా ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. కస్టమర్‌కు విశ్రాంతి, వినోదం ఇచ్చే ఇలాంటి భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌లో మొదటిది అని వారు తెలియచేశారు. ఈ వెంచర్‌కు ఇప్పటికే విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ వెంచర్‌లో ప్రపంచంలోని 7 వండర్స్ తాలూకా కళాకృతులు, రిసార్ట్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఈ స్వప్నలోక్ వెంచర్ సమీపంలో ప్రఖ్యాత పర్యాటక కేంద్రమైన తాటిపూడి రిజర్వాయర్ ఉందన్నారు. అందులో బోట్ షికారు కూడా ఉంటుందని తెలిపారు. 200 ఎకరాల్లో హెలీ టూరిజంను ప్రారంభించడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఈ వెంచర్‌కు సమీపంలో 500 ఎకరాల్లో జిందాల్ కంపెనీ వారి టూరిస్ట్ స్పాట్‌కు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో స్వప్నలోక్ వెంచర్ సమీప ప్రాంతంలో భవిష్యత్తులో పర్యాటక అభివృద్ధి జోరుగా సాగనుందన్నారు. ఈ వెంచర్ మీదుగా 4 లైన్లు హైవే పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు ఏప్రిల్‌లో మెగా కస్టమర్ మేళా తాటిపూడి వద్ద స్వప్నలోక్ వెంచర్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సుమారు 1500 మంది మార్కెటింగ్ సభ్యులు, డైరెక్టర్ తాళ్ళూరి శివాజీ, కిరణ్ శంకర్, గోపాల్ తదితరులు హాజరయ్యారు.


మాట్లాడుతున్న డిసిఓ

పిఎసిఎస్‌లో రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి -వడ్డాది:ఆధునిక డిజిటలేషన్ ద్వారా పిఎసిఎస్ సేవలు మరింత పటిష్టం చేస్తామని డిసిఓ ప్రేమ స్వరూప రాణి తెలిపారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది పిఎసిఎస్‌ను ఆదివారం ఆమె పరిశీలించారు రికార్డులను పరిశీలించారు. బ్యాంకు ఖాతాదారులకు ఇస్తున్న లోన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు వడ్డాది పిఎసిఎస్ లో ఇక మీదట రికార్డులన్నీ కంప్యూటర్ చేయాలని తెలిపారు. డిజిటల్ సేవలను రైతులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు ఈ కార్యక్రమంలో పిఎసిఎల్ కిరణ్ కుమారి. ఎస్ మురళీకృష్ణ, మాడుగుల బ్రాంచ్ మేనేజర్ మహేశ్వరరావు, యూనియన్ ప్రెసిడెంట్ బి లక్ష్మణరావు, వడ్డాది సీఈఓ ఎస్ శాంతి పాల్గొన్నారు.